క్లుప్తంగా

ఉపాధి హామీ కూలీలకు పండ్ల పంపిణీ



ఉపాధి హామీ కూలీలకు పండ్లు, డ్రింక్స్ అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: తన తల్లి దిమ్మల అచ్చియమ్మ వర్ధంతిలో భాగంగా మంగళవారం మునగపాకలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు పండ్లు, డ్రింక్స్‌ను సర్పంచ్ అప్పారావు అందజేశారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పండ్లు తీసుకోవాలన్నారు. వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

రీసర్వే వేగవంతం చేయాలి

మునగపాక: రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఆర్‌డీవో శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన మునగపాక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రీసర్వే జరుగుతున్న గ్రామం వివరాలతో పాటు ఎంత మేర సర్వే జరిగిందన్న విషయమై డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబును అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.

నేడు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

మునగపాక: మండలంలోని రెండు సచివాలయాల పరిధిలో బుధవారం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. తోటాడ, గంటవానిపాలెం సచివాలయాల్లో జరిగే ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



రైతులను సన్మానిస్తున్న అధికారులు

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్లలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న ఆరుగురు రైతులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. సన్మాన గ్రహీత భాను ప్రకాశ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం వల్ల భూసారం పెరుగుతుందని, ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఈ పద్ధతిలో దిగుబడి వచ్చిన ఉత్పత్తుల వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. ఎంఏవో శేఖర్ గోవింద్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



అచ్యుతాపురం గ్రంథాలయంలో ధ్యానం చేస్తున్న విద్యార్థులతో విజయ

అచ్యుతాపురం: ధ్యానంతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చేకూరుతుందని అచ్యుతా ఇంగ్లిష్ మీడియం స్కూల్ హిందీ టీచర్ విజయ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరానికి రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఆమె విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. మెడిటేషన్ ప్రాధాన్యత, సనాతన ఆచారాల్లో దీనికున్న విశిష్టతను తెలియజేశారు. ధ్యానంతో మెదడు ఆరోగ్యం బలపడుతుందని, మంచి ఆలోచనలు వస్తాయని చెప్పారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



విజేతలతో కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక శ్రీరామ దేవ వ్యాయామ సంఘం సభ్యులు విజయం సాధించారు. వీరిని మంగళవారం జిమ్ నిర్వాహకులు అభినందించారు. 53 కేజీల విభాగంలో గుమ్మాల భానుప్రసాద్, 61 కేజీల విభాగంలో కోడూరు జగన్నాథం, 93 కేజీల విభాగంలో ఇల్లపు గణేష్, 71 కేజీల విభాగంలో టెక్కలి శ్రీనివాస్, 110 కేజీల విభాగంలో శ్రీకాకుళపు స్వరూప్ గోల్డ్ మెడల్స్ సాధించారు. 83 కేజీల విభాగంలో చిత జయంత్, జాజుల రామ లక్ష్మి, 72 కేజీల విభాగంలో సబ్బవరపు శ్రావణ కుమార్ సిల్వర్ మెడల్స్ సాధించారు. జార్జి క్లబ్ జిమ్ సభ్యుడు ఆళ్ల నవీన్ 66 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. అతడిని క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు అభినందించారు.

కూడు పెట్టని కులవృత్తులు..!

అచ్చమైన పల్లెటూరు వాతావరణానికి కులవృత్తులు ఎంతగానో దోహదపడేవి. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు కులవృత్తులు తోడుగా ఉండేవి. వ్యవసాయానికి సంబంధించి కత్తులు, కొడవళ్లు, నాగళ్లు, తాటాకులు, పశువులను కట్టేందుకు తాళ్లు, వంటావార్పునకు కుండలు, ఇలా ప్రతి పరికరమూ వివిధ కులవృత్తుల్లో అలవోకగా తయారయ్యేవి. కులవృత్తులతో బతికే వారంతా రైతన్న కుంటుంబంగానే మెలగేవారు. ఆధునికత పెరిగింది. కులవృత్తులకు ఆదరణ కరవైంది. రాను రాను కులవృత్తులు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



మట్టి పొయ్యిని తయారు చేస్తున్న దృశ్యం

- ఆధునిక పోకడలతో కనుమరుగవుతున్న వైనం
- కనిపించని పేదోడి ఫ్రిడ్జ్
- ప్రస్తుతం కానరాని మట్టి కుండలు

కోటవురట్ల: పల్లెల్లో సైతం ఆధునికత చోటు చేసుకోవడంతో ఆనాటి పరికరాలు ఓ జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోతున్నాయి. కులవృత్తులు కూడు పెట్టక ఆ సామాజిక ప్రజలు వేరే పనుల్లోకి మారి జీవితాలను వెళ్లదీస్తున్నారు. కాలానుగుణంగా పనులు చేసుకుంటూ కులవృత్తులకు సెలవిచ్చేస్తున్నారు.

పేదోడి ఫ్రిడ్జ్ ఎక్కడ?

కులవృత్తుల్లో ప్రధానమైనది కుమ్మరి పని. ప్రతి గ్రామంలో ఈ కులవృత్తిలో కొనసాగేవారు ఎక్కువగానే ఉండేవారు. ఒకప్పుడు ఇంట్లో వంట చేయాలంటే మట్టి పాత్రలనే వినియోగించేవారు. వేసవిలో చల్ల చల్లగా నీళ్లు తాగాలంటే మట్టి కుండలు, మట్టి కూజాలను వాడేవారు. ప్రతి ఇంట్లో కాస్త ఇసుక వేసి దానిమీద కుండపెట్టి మంచినీళ్లు ఉంచేవారు. ఇదే పేదలకు చల్లటి ఫ్రిడ్జ్‌గా సేవలందించేది. దీపావళి వస్తే మట్టి ప్రమిదలలో దీపం వెలిగించేవారు. ఇక హిందూ వివాహాల్లో అరివేణి తప్పనిసరి. నేటికీ పెళ్లిలో అరివేణిని కచ్చితంగా వాడతారు. వేసవి వస్తే ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు వెలిసేవి. ఈ చలివేంద్రాలలో ఇసుక వేసి పెద్ద కుండలు పెట్టి మంచినీళ్లు అందుబాటులో ఉంచేవారు. ఇప్పటికీ పలు చోట్ల ఇటువంటి చలివేంద్రాలు తారసపడుతుంటాయి. ఇప్పుడు వాటి స్థానంలో కూల్ వాటర్ క్యాన్లు వచ్చేశాయి. దీంతో కుమ్మరులకు చాలా వరకు పని తగ్గిపోయింది. అయినా కులవృత్తిని వదల్లేని ఒకరిద్దరు మాత్రం అదే వృత్తిలో కొనసాగుతూ జీవనం వెళ్లదీస్తున్నారు. కోటవురట్లలో కుమ్మరి పనిలో సుమారు 30 కుటుంబాలు వరకు ఉండేవి. గిట్టుబాటు కాకపోవడంతో ప్రస్తుతం ఐదు కుటుంబాలు మాత్రమే ఇందులో కొనసాగుతున్నాయి. మట్టి పాత్రలు చేసేందుకు మట్టి కూడా దొరకని పరిస్థితి నెలకొంది. మట్టిని సైతం కొనుగోలు చేసి కుండలు, మట్టి పాత్రలు, ప్రమిదలు, బొగ్గుల పొయ్యి, మట్టి పొయ్యి, పశువులకు నీళ్ల కుండీలు, వివాహానికి అవసరమైన అరివేణి తయారు చేస్తున్నారు. కాకినాడ జిల్లా తుని, కోటనందూరు, అనకాపల్లి జిల్లా వేంపాడు, నర్సీపట్నం తదితర ప్రాంతాలలో వీటిని విక్రయిస్తున్నారు. కులవృత్తులను ప్రోత్సహించేలా ప్రభుత్వం సహకారం అందించాలని వారు కోరుతున్నారు.



మట్టి పాత్రలను కాలుస్తున్న దృశ్యం



విక్రయాలకు సిద్ధంగా ఉన్న మట్టి కుండలు



మట్టి పొయ్యి

ఎంత కష్టపడినా గిట్టుబాటు లేదు..



నా చిన్నప్పటి నుంచి కుమ్మరి వృత్తిలోనే ఉన్నాను. మా ముత్తాతల కాలం నుంచి ఇదే వృత్తి. ప్రస్తుతం మేము చేసే పనికి గిట్టుబాటు కావడంలేదు. ఇంట్లో అందరూ ఎంత కష్టపడినా నెలకు మిగిలేది రూ.10 వేలుకు మించదు. మా పెద్దబ్బాయి సంతోష్ నాకు సహాయంగా ఇదే పని చేస్తున్నాడు. మా చిన్నోడు కుమార్ వైజాగ్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేసుకుంటున్నాడు.

–అనకాపల్లి గోవిందు, కుమ్మరి వృత్తి, కోటవురట్ల

వేరే పని చేయలేక..



మా కులవృత్తిని వదిలి వేరే పని చేయలేక ఇందులోనే కొనసాగుతున్నాం. ప్రస్తుతం స్థానికంగా మట్టి పాత్రలు కొనడంలేదు. పెళ్లిళ్ల సీజన్‌లో మాత్రమే అరివేణి బేరాలు వస్తున్నాయి. దీపావళికి ప్రమిదల బేరం ఉంటుంది. మిగతా రోజుల్లో పని లేక ఏడాదిలో ఆరునెలల పాటు వేరే ప్రాంతాలకు ఇటుక పనికి వలస పోతాం. ప్రభుత్వం మాలాంటి కులవృత్తుల వారిని ఆదుకోవాలి.

–అనకాపల్లి రామారావు, కుమ్మరి పని, కోటవురట్ల

ప్రభుత్వ సహకారం అవసరం



కుమ్మరి వృత్తిలో కొనసాగేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. రాయితీ రుణాలు ఇవ్వడంతో పాటు మట్టిని ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలి. మేము తయారు చేసిన మట్టి వస్తువులకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి ఏటికొప్పాక కళాకారులకు మాదిరి సహకారం ఇవ్వాలి. ఏటా ప్రోత్సాహక నగదు అందించాలి.

–అనకాపల్లి వీరభద్రరావు, కుమ్మరివృత్తి, కోటవురట్ల

సమీకృత పశుదాణాతో సత్ఫలితాలు

కోటవురట్ల: వేసవిలో పశుగ్రాసం కొరత రాకుండా సమీకృత దాణా ఉపయోగపడుతుందని పశు వైద్యాధికారి డాక్టరు బాబూరావు పడాల్ తెలిపారు. కె.వెంకటాపురంలోని పశువైద్య శాల వద్ద సమీకృత పశుదాణాను మంగళవారం పంపిణీ చేశారు. బాబూరావు పడాల్ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా సమీకృత మిశ్రమ దాణా 50 కిలో బ్యాగు రాయితీ పోను రూ.550కు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, రైతులు పైల నాని, తిరుమలరావు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కె.వెంకటాపురంలో పశుదాణా ప్యాకెట్లు అందిస్తున్న అధికారులు

బాల్య వివాహాలను అరికట్టాలి

మునగపాక: బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి రమ్య కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట, పల్లపు ఆనందపురం గ్రామాల్లో మంగళవారం ఆమె కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలో ఉన్న పిల్లలను గుర్తించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 11 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, గ్రామ మహిళా కార్యదర్శులు లావణ్య, తులసి, అంగన్‌వాడీ టీచర్లు కాండ్రేగుల సత్య, బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి రమ్య

పునరావాసం కోసం దరఖాస్తు చేసుకోండి

అచ్యుతాపురం రూరల్ : అనకాపల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రావిపాలెం గ్రామంలో బార్క్ భూనిర్వాసితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో పునరావాసం కోసం ఇప్పటికి 62 మంది పేర్లు నమోదు చేశామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ డీ పట్టా భూములకు ఎకరాకు రూ.60లక్షలు, ప్రస్తుతమున్న బార్క్ రోడ్డునే పొడిగింపు చేసుకోవాలని, గ్రామాన్ని తరలించాలని, లేనియెడల 5 సెంట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, కో–జెడ్పీటీసీ నర్మాల కుమార్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



రావిపాలెంలో భూనిర్వాసితులతో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

సాగునీటి కాలువల సమస్యలకు సత్వర పరిష్కారం

ఎస్.రాయవరం: నీటి సంఘాల ఆధ్వర్యంలో ఉన్న సాగునీటికాలువల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు పాయకరావుపేట ఇరిగేషన్ డీఈ సురేష్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నీటి పారుదల శాఖ చైర్మన్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో చాలా కాలంగా సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు సక్రమంగా అందడం లేదని నీటి సంఘాల సభ్యులు ఏకరువు పెట్టారు. దీనికి అధికారులు బదులిస్తూ తక్షణం కాలువల్లో పూడిక తీత పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాను, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.సత్యనారాయణ, నీటి సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ట్విట్టరు క్యాంపెయిన్‌తో సీహెచ్‌వోల నిరసన

అనకాపల్లి: జిల్లాలో పీహెచ్‌సీల పరిధిలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ ఈ కార్నర్ వద్ద సీహెచ్‌వోల సమ్మె మంగళవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు తమ సమస్యలపై ట్విట్టర్‌లో ప్రభుత్వానికి పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు నేటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సీహెచ్‌వోలను ఆరేళ్లకే పర్మినెంట్ చేస్తామని, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం, జాబ్ చార్ట్ తదితర డిమాండ్లు నెరవేర్చే దిశగా ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు భవాని, యమున, రేవతి, నూకాలమ్మ, లక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ట్విట్టర్ క్యాంపెయిన్‌తో కమ్యూనిటీ హెల్త్ అధికారులు నిరసన

17న అనకాపల్లిలో సివిల్స్, గ్రూప్–1పై సదస్సు

మునగపాక: అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో ఈ నెల 17న సివిల్స్, గ్రూప్–1 పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సదస్సుకు వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్, బోధకులుగా సివిల్స్–25 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని, తదితరులు హాజరవుతారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 92471 66511 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి



మాట్లాడుతున్న కార్మిక శాఖ అధికారి కోటేశ్వరరావు

అచ్యుతాపురం: అసంఘటిత రంగ కార్మికులు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని ఆ శాఖ అధికారి కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఎర్రవరం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి కార్మికులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. గుర్తింపు కార్డులు పొందిన వారికి కార్మిక శాఖ ద్వారా ప్రమాద, మరణ బీమా అందుతుందన్నారు. ఆధార్ కార్డు జెరాక్స్, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబర్స్‌తో పాటు, సంబంధిత రంగంలో పని చేస్తున్నట్లు తెలిపి కార్మిక శాఖలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మట్టి తవ్వుతున్న పొక్లెయిన్ స్వాధీనం



రామారాయుడుపేటలో మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

మునగపాక: అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్న పొక్లెయిన్‌ను మునగపాక పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రామారాయుడుపేటలో అనధికారికంగా మట్టి తవ్వుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నామని, దీనిని మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు.

అక్రమ కుళాయిల తొలగింపు

యలమంచిలి రూరల్: మండలంలోని జంపపాలెంలో పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకున్న కుళాయిలను మంగళవారం సచివాలయ సిబ్బంది తొలగించారు. గ్రామంలో పలువురు పంచాయతీ కుళాయిలకు అదనంగా పైపులు అతికించి ఇళ్లలోకి అక్రమంగా నీటిని తరలించుకుంటున్నారు. దీంతో ఆ పరిసరాల్లో నివసించే ఇతరులకు నీటిని పట్టుకునేందుకు ఇబ్బంది ఏర్పడుతోంది. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కుళాయిలను గుర్తించి తొలగించారు. అక్రమంగా కుళాయిలను ఏర్పాటు చేస్తే జరిమానా విధిస్తామని ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హెచ్చరించారు.



జంపపాలెంలో అక్రమ కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న సచివాలయ సిబ్బంది

ఊరూరా.. జాతర



రేవుపోలవరంలో బంగారమ్మతల్లి సన్నిధిలో పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



కొరుప్రోలులో పైడితల్లమ్మకు సారె తీసుకెళ్తున్న మహిళలు



పైడితల్లమ్మ జాతరలో మహిళల కోలాటం

ఎస్.రాయవరం: పల్లెల్లో జాతర్ల సందడి నెలకొంది. రేవుపోలవరం గ్రామంలో బంగారమ్మ పాలెం జాతర మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, కొత్తరేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వమ్మవరం ఎంపీటీసీ బాలం సూరిబాబు, సోషల్ మీడియా కన్వీనర్లు చేపలరాజు, వియ్యపు సింహాద్రి తదితరులు దర్శించుకున్నారు.



దార్లపూడిలో పూజలందుకున్న అభయాంజనేయ స్వామి

- కొరుప్రోలు గ్రామంలో పైడితల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.
- దార్లపూడి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

డీపీటీవో కార్యాలయ ముట్టడి

అనకాపల్లి టౌన్: రాష్ట్ర స్థాయిలోని సమస్యలు పరిష్కరించాలని, అక్రమంగా బదిలీ చేసిన ఉద్యోగులకు కండక్టర్ ఎస్ఎస్ నారాయణకు అనకాపల్లి డిపోలోనే పోస్టింగ్ ఇవ్వాలని ఎస్ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణలో డీపీటీవో కార్యాలయ ముట్టడి కార్యక్రమం మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్మికులు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు వి. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 0–19 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్, జోనల్ చైర్మన్ ఎం. సూర్యం, ఉపాధ్యక్షుడు బి.ఎస్. రంగా, ఎస్. రాజు, జి. శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎంయూఏ నాయకులు

సివిల్ సప్లయి కార్మికుల ధర్నా

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20 దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. శంకరం పంచాయతీలో సివిల్ సప్లయి యూనియన్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక వర్గం బుద్ధి చెప్పడానికి సమ్మె తలపెట్టినట్టు పేర్కొన్నారు. సివిల్ సప్లయి గొడౌన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.త్రినాథ్, కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు